క్లుప్తంగా

న్యాయవాదులు విధుల బహిష్కరణ



మిర్యాలగూడలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మిర్యాలగూడటౌన్ : రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపుమేరకు శుక్రవారం మిర్యాలగూడలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు బయట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్లయ్య, కొంక వెంకన్న, ఇబ్రహీం, దాసరాజు, శ్రీనివాస్, మల్లేష్, కస్తూరి నాగేందర్, కొండల్, ప్రభాకర్, గంగాభవాని తదితరులు ఉన్నారు.

అనుముల మండల ఇన్‌చార్జ్ ఏఓగా మల్లేష్



హాలియా : అనుముల మండల ఇన్‌చార్జ్ ఏఓగా మునుగోడుకు చెందిన పి.మల్లేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిడమనూరు మండలానికి చెందిన ఏఓ ముని కృష్ణయ్య గత కొన్ని నెలలుగా అనుముల మండల ఇన్‌చార్జ్ ఏఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా నిడమనూరు మండల కేంద్రంలో గురువారం యూరియా కోసం రైతులు చేసిన రాస్తారోకో విషయంలో అక్కడ వ్యవసాయాధికారిగా పని చేస్తున్న ముని కృష్ణయ్య సకాలంలో స్పందించ లేదనే విషయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఏఓ ముని కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అనుముల మండలానికి ఇన్‌చార్జ్ ఏఓగా మునుగోడు మండలానికి చెందిన ఏఓ పి.మల్లేష్‌కు బాధ్యతలు అప్పగించారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

నాగార్జునసాగర్ : మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవిలత, వైస్ ప్రిన్సిపాల్ రఘువీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.లలిత, సత్యనారాయణ, జానయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం పీఏపల్లి మండలంలో తిరుమలగిరి, గుడిపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

కార్మికులకు వేతనాలు అందించాలని వినతి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. ఈమేరకు శుక్రవారం దామరచర్ల ఎంపీఓకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కార్మికులకు రూ.26 వేల వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేసిందన్నారు. కార్మికులకు కనీస వేతనం అందించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, సైదులు పాల్గొన్నారు.



దామరచర్ల ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నిరుపయోగంగా పాఠశాలల భవనాలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యను అందించేందుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాలల భవనాలు వృథాగా మారుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంగా మండలంలోని చక్కోలంతండా, చెన్నాయిపాలెం ప్రాథమిక పాఠశాలలను గత కొన్ని సంవత్సరాల క్రితం మూసివేశారు. అయితే ఆయా పాఠశాలలకు సంబంధించిన భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న చక్కోలంతండా పాఠశాల భవనం



నిరుపయోగంగా ఉన్న చెన్నాయిపాలెం పాఠశాల భవనం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

• దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దేవరకొండ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా గ్రామపంచాయతీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. తండాలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మర్రిచెట్టు తండా, బుడ్డతండా మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి రూ. కోటి 70 లక్షలు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, డీఈ నగేష్, రుక్మారెడ్డి, నల్లగాసు జాన్‌యాదవ్, హన్మంతు వెంకటేష్‌గౌడ్, కొర్ర రాంసింగ్, శ్రీనునాయక్, సీత్యా నాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ ఆర్థిక సహకారంతో క్రీడాకారులకు టీ షర్ట్‌లను అందజేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పడమటి తండాలో ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ లింక్ కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన తొమ్మిది కుటుంబాలను ఆదుకుంటామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబాలకు ఒకొక్కరికి ప్రభుత్వం నుంచి మంజూరయిన రూ.3 లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, బోద్యానాయక్, రాంసింగ్‌నాయక్, జబ్బార్‌లాల్ తదితరులున్నారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

• ఆర్డీఓ రమణారెడ్డి

దేవరకొండ: రెవెన్యూ చట్టాలపై ఇటీవల నూతనంగా నియమించబడిన జీపీఓలు అవగాహన కలిగి ఉండాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు.శుక్రవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని గ్రామ పాలన అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధికారులుగా బాధ్యతలు తీసుకున్న జీపీఓలు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ అంశాలపై అవగాహన పెంచుకుని ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా జీపీఓలు పనిచేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ ఆంజనేయులు, డీపీఓ కిరణ్మయి, నాయబ్ తహసీల్దార్ అయ్యూబ్‌ఖాన్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్ తగదు

మిర్యాలగూడ : సమస్యలను పరిష్కరించాలని కోరితే ప్రభుత్వం అరెస్ట్‌లకు పాల్పడడం తగదని సీఐటీయూ దామరచర్ల మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ ఆయాలను, సీఐటీయూ నాయకులను వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తున్నాయని అన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం అందించాలన్నారు.



వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న బైరం దయానంద్

హౌస్ అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో అంగన్‌వాడీ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను శుక్రవారం తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పట్టణంలోని ఈదులగూడెంలో అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొందు పార్వతిని అరెస్ట్ చేసి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో ఆమ్మదిబేగం, సోమేశ్వరీ, కాల్వపల్లిలో ఇంద్రపల్లి సైదమ్మ, సీతారాంపురం, బంగారుగడ్డలో సోమేశ్వరి, యాదాబాయిని హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బొందు పార్వతి, ఇంద్రపల్లి సైదమ్మ మాట్లాడుతూ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌ను అంగన్‌వాడీ కేంద్రాలల్లోనే ప్రారంభించాలని అనుకున్న ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని అనడం సరైంది కాదన్నారు. అంగన్‌వాడీ టీచర్లను అడ్డుకోవడం ప్రజాపాలన ప్రభుత్వం కాదన్నారు.

సహకార సంఘానికి 20 టన్నుల యూరియా రాక



సహకార సంఘంలో యూరియా పంపిణీ చేస్తున్న సహకార ఉద్యోగులు, పోలీసులు

నిడమనూరు : నిడమనూరు సహకార సంఘానికి శుక్రవారం 20 టన్నుల యూరియా రాగా, గురువారం రైతులకు పంపిణీ చేశారు. టోకెన్లు, ఆధార్ ఆధారంగా సహకార సంఘంలోకి అనుమతి ఇచ్చి పోలీస్ బందోబస్తు మధ్య శుక్రవారం యూరియాను పంపిణీ చేశారు. తమకు కూడా టోకెన్లు జారీ చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తోపాటు, నిడమనూరు మండల రైతులకే యూరియా అందిస్తామని వ్యవసాయాధికారులు ప్రకటించారు. హాలియా సీఐ సతీష్‌రెడ్డి యూరియా పంపిణీని పర్యవేక్షించారు.

సాగర్ భద్రతను ఎస్పీఎఫ్‌కే అప్పగించాలని వినతి

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను ఎస్పీఎఫ్(ప్రత్యేక రక్షణ దళం)కే అప్పగించాలని నందికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, మాజీ కౌన్సిలర్ హిరేకార్ రమేష్‌జీ శుక్రవారం కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యేకు వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో పదేళ్ల పాటు ఎస్పీఎఫ్ దళాలే డ్యామ్‌కు రక్షణ కల్పించాయని తెలిపారు. రెండేళ్లుగా సీఆర్పీఎఫ్ దళాలు పహారా కాస్తున్నాయన్నారు. సాయుధ బలగాలను తొలగించి ప్రత్యేక రక్షణ దళానికే డ్యామ్ బాధ్యతలు అప్పగించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయ ఆవరణం జలమయం

గుర్రంపోడు : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నీట మునిగింది. దీంతో కార్యాలయంలోకి పనుల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థులు క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శాగం పెద్దిరెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 బాల, బాలికల క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి, నాగిరెడ్డిలు మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్, పీడీలు సత్యనారాయణ, కోడుమూరి వెంకట్రాంరెడ్డి, జ్వాల నర్సింహారావు, ఆయా మండలాల పీడీలు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్లు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : భారత ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకొని ×సేవ దీక్ష ఆత్మనిర్భర్ భారత్- వికసిత్ భారత్×అనే అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రపంచంలో భారత దేశం అగ్రగామిగా నిలిచిందని, దేశం కోసం మోదీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడమే మోదీ ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంటు సైదులు, సజ్జల నాగిరెడ్డి, కంచుకొమ్ముల వేణు, కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, మహేశ్వరం యాదమ్మ, సరస్వతి శిశు మందిర్ ప్రధానాచార్యులు చెన్నూరు రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రిన్సిపాల్

దేవరకొండ: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకర రమేష్ తెలిపారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ కౌన్సిలింగ్ రూమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ప్రత్యేక చొరవతో కళాశాలలో హాజరు శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు తల్లిదండ్రులతో కలిపి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తమ పిల్లలు ప్రతిరోజు తరగతులకు హాజరవుతున్నారా, లేదా అనే విషయాలు తెలుసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిసాయం అందజేత



హాలియా : ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

హాలియా : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుములవారిగూడేనికి చెందిన నిరుపేద కుటుంబీకుడు నడ్డి దయాకర్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని గురువారం సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. నడ్డి దయాకర్ ఇద్దరు కుమార్తెలను తానే చదివిస్తానని భరోసా ఇచ్చారు. అయితే ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రూ. 25వేల ఆర్థికసాయం పంపించగా స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిల్లి ఆంజనేయులు, గొర్ల ఈదయ్య, సంద్ర వెంకటయ్య, బూర నాయక్, వెంకటేశ్వర్లు, చరబండ రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అక్టోబర్ 16వ తేదీ వరకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమాబేగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్ సెక్టర్ పరిధిలోని పాపాసుల దిబ్బ, గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు తూడి అరుణ, ధనలక్ష్మి, హెల్పర్ లక్ష్మీకాంతం, తదితరులున్నారు.

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండలంలోని పోలేపల్లి రాంనగర్ గ్రామంలో శుక్రవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, బాలబాలికలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుగుణ, డాక్టర్ వంశీ, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, శారద, పద్మ, స్వప్న, లాలా, యాదమ్మ, వసంత, మమత తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు, చిన్నారులు

డిండి: కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సీడీపీవో చంద్రకళ అన్నారు. డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పద్దెనిమిది సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరికృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



దామరచర్లలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : నియోజకవర్గంలోని రైతుల సంక్షేమ కోసం సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రూ.2 కోట్లు అందించడాన్ని హర్షిస్తూ గురువారం దామరచర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువ నేత ధనావత్ సిద్ధూనాయక్ మాట్లాడుతూ రైతుల బాధలు తన బాధ అనుకొని తన సొంత డబ్బులు రూ.2 కోట్లను సీఎం సహాయ నిధికి అందించి నియోజకవర్గంలోని లక్ష మంది రైతులకు ఒక బస్తా చొప్పున ఉచితంగా యూరియా అందించాలని ఎమ్మెల్యే కోరారని అన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకొని క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు నందిని రవితేజ, బంటు కిరణ్, కొర్ర నాగునాయక్, ధనావత్ పవన్‌నాయక్, గుగులోతు వంశీనాయక్, మోహన్‌రెడ్డి, రూపావత్ శివనాయక్, లావూరి సైదానాయక్, మున్నానాయక్, రమణ, కోటిరెడ్డి, మాలోతు వినోద్‌నాయక్, ఉమేష్‌నాయక్, సందీప్, రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రైతుల సంక్షేమానికి రూ.రెండు కోట్లు ఇవ్వడంపై రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కంచర్ల అనంతరెడ్డి, అధ్యక్షుడు అనుముల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే రెండు కోట్లు అందించడం అభినందనీయం అన్నారు. పాప చెన్నారెడ్డి, నామిరెడ్డి నర్సింహారెడ్డి, ఫల్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డి, గార్లపాటి శ్రీరామ్‌రెడ్డి, సోమసాని వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పేదరికాన్ని నిర్మూలించాలంటే చదువుతోనే సాధ్యమని టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూ రిబాగాంధీ బాలికల విద్యాలయంలో చదువు, క్రమశిక్షణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే అది చదువుతోనే సాధ్యమని అన్నారు. చదువు మనిషిని విజ్ఞానవంతుడిగా, సమాజానికి ఉపయోగపడేలా చేస్తుందని చెప్పారు. పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజం, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులకు తమ సంఘం తరఫున నగదు పురస్కారం అందిస్తామని ఆ సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మేగావత్ భాస్కర్ నాయక్ తెలిపారు. జటావత్ చంద్రు నాయక్, రమావత్ నరేష్ నాయక్, మేగావత్ భాస్కర్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మిర్యాలగూడ : పట్టణంలోని షైనింగ్‌స్టార్ విస్డమ్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కుర్ర కాంతి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, సోమ య్య, కుసుమ, కాంతామని, రంగానాయక్, నందిని, అంజలి, పూజ, చిన్న, బుజ్జి, మంగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విత్తనోత్పత్తి క్షేత్రాల పరిశీలన

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో విత్తనోత్పత్తి క్షేత్రాలను శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ శాస్త్రవేత్త రాజేందర్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షానికి వరి పంటలో చీడపీడల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రావుల పాండు, ఏఈఓ దెబోర, సర్దార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ డీఈకి వినతి

కొండమల్లేపల్లి : టీజీఎస్‌పీడీసీఎల్‌లో 15 సంవత్సరాలుగా ఫీస్ రేట్ పద్ధతిన స్పాట్ బిల్లింగ్ చేస్తున్న తమకు వేతనాలు పెంచాలని శుక్రవారం టీజీఎస్‌పీడీసీఎల్ దేవరకొండ డివిజనల్ విద్యుత్ ఇంజినీర్ విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ ఏరియాలో రూ.4వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. సెమి స్కిల్ ఆర్డర్ కాపీ ఇవ్వని పక్షంలో స్వచ్ఛందంగా విధులు బహిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్ స్పాట్ బిల్లింగ్ కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంపోడు : మండలంలోని మూడు గ్రామాల ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు మండల విద్యాధికారి నోముల యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బుడ్డరెడ్డిగూడెం, తేనపల్లి తండా, జిన్నాయిచింత గ్రామ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీకిగాను ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోగా మండల విద్యావనరుల కేంద్రంలో అందజేయాలని కోరారు. ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్‌మీడియట్, ఆయాకు ఏడవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. రెండు రకాల పోస్టులకు 18 నుంచి 44 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మరో ఐదేళ్ల సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. వికలాంగులకు పదేళ్ల వయస్సు సడలింపు ఉంటుందని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8 వేల వేతనం, ఆయాకు రూ.6వేల వేతనం ప్రతినెలా అందించడం జరుగుతుందని తెలియజేశారు.

నేడు సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని హనుమాన్‌పేటలో గల సీఐటీయూ కార్యాలయంలో శనివారం సీఐటీయూ మిర్యాలగూడ పట్టణ, మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ కన్వీనర్ తిరుపతి రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బికార్ మల్లేష్, సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్మి కుల సమస్యలు, జిల్లా మహాసభల ఏర్పాట్లు, సభ్యత్వ నమోదుపై చర్చించనున్నామని, కార్మి కులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం

చందంపేట : స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి చందులాల్ తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందిస్తామని పేర్కొన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరాలు, వాటర్ ఫిల్టర్ అందజేత

నడిగూడెం: మండలంలోని తెల్లబల్లిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్ సౌజన్యంతో ఖమ్మంకు చెందిన బత్తినేని రాకేష్, బత్తినేని ప్రకాష్‌ల దాతృత్వంతో పాఠశాలకు రూ.75 వేల విలువ గల సీసీ కెమెరాలు, వాటర్ ఫిల్టర్ బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, మాజీ సర్పంచ్ దేవబత్తిని వెంకటనర్సయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.